కలిసిరాని
కన్నెపిల్లకి
కుదిరిన సంబంధం
ఆమెను
ఓ యింటిదాన్ని
చేసిందా?

# శివల జగన్నాధరావు కథ


బస్సు భారంగా మూలిగి వచ్చి స్టాపులో ఆగింది. బస్సులోంచి బస్తాలకొద్దీ మనుషులు ఆడా, మగా, ముసిలీ ముతకా, పిల్లాపీచూ దిగారు, వాళ్ళంతా రంగురంగుల బట్టలేసుక్కుని, షోకుషోకు ముస్తాబులయ్యా, ఘుమాఘుమామనే పవుడర్లూ, సెంట్లూ కొట్టుకొనీ, పెళ్ళి కళతో ఫెళఫెళ్ళాడిపోతున్నారు. ఎయిరిండియా గుర్తులున్న బ్యాగులు, బుట్టలూ, సంచులూ, సూటుకేసులూ వగయిరా సామాన్లతో వున్న ఆ మగపెళ్ళివాళ్ళని, విడిదికి తీసుకువెళ్ళడానికి, ఆడపెళ్ళివారి తరఫున అయిదుగురు మగా, ఆడ వచ్చారు.

విడిదిల్లు వికసించిన పుష్పంలా సొగసులీనుతోంది!

ఒకే వీధిలో, నాలుగే ఇళ్ళు ఎడంగా అటు ఆడ పెళ్ళివారి ఇల్లూ, ఇటు మగపెళ్ళివారికి విడిదీ వున్నాయి. కల్యాణమంటపం అవతలవీధిలో వుంది.

ఆడపిల్ల తండ్రి వెంకటశివం వెయ్యికాళ్ళ జెర్రిలాగా పరిగెత్తుతూ పనులు చేసుకువస్తున్నాడు. వెంకటశివానికి మగపిల్లలు లేరు. వెయిట్ చేసినకొద్దీ వెర్రెక్కిస్తూ నలుగురూ ఆడపిల్లలే పుట్టారు. ఇంక మగవెధవకోసం వెయిట్ చెయ్యలేనంటూ, ఆపరేషన్‌తో కోపరేషన్ ఇచ్చేడటు ప్రభుత్వానికీ, ఇటు భార్యకీ.

పెద్ద పిల్ల దమయంతి ఇంటరు చదువుకే హంటర్‌తో కొట్టినంతవాడయి బెంగ, భయం పడిపోయి, అక్కడితో ఇంక పుస్తకాన్నీ, మస్తకాన్నీ మూసేసీ, పెళ్ళి అనే



మార్గంవేపు దృష్టి మళ్ళించింది. ఏళ్ళు తిరిగిపోతున్నాయి! వూళ్ళు తిరుగుతున్నాడు వెంకటశివం. ''పాతికవేలిస్తావా? ఏభయి వేలిస్తావా? స్కూటరిస్తావా? లండనుకి టికెట్టిస్తావా?'' అంటూ హిరణ్యాక్ష వరాలడిగే పెళ్ళికొడుకుల తండ్రుల్తో విసిగి పోతూంటే ఆఖరికి, చివరికి, కొసాకి దమయంతికి ముప్పయి ఏళ్ళకి మూడు

మాసాలే తక్కువయ్యే టయిముకి ఈ సంబంధం సెటిలయింది!!

"అబ్బాయి గ్రాడ్యుయేటుట! గవర్నమెంటుద్యోగం లేకపోతేనేమి? ప్రభుత్వ సహకారంతో అప్పుతెచ్చి, ప్రెస్సు నడుపుతున్నాడు! ఫర్వాలేదు! ఏదో ఆదాయం బాగానే వొస్తుందిట! ఫర్వాలేదు! అబ్బాయి సుందరానికి పెద్ద ఆశ లేదుగానీ, వాళ్ళ నాన్న సీతాపతిగారికి పదివేల రూపాయల ఆశ వుంది!! పోనీలే!! ఆ పైన ఇంకేమీ గొంతెమ్మ కోరికలు కోరలేదు! నయ్యం! వాళ్ళ ధర్మమాని ఇంతతో పోనిచ్చేరు!"

అనీ వెంకటశివం సంతోషించీ ఒప్పేసుకున్నాడు.

అతను విజయవాడలో వుంటున్నాడు వుద్యోగరీత్యా.

సీతాపతిది ఆ ప్రక్క వూరు.

అయితే పెళ్ళిమాత్రం అక్కడాకాదు. ఇక్కడా కాదు. తనున్న చోటే చెయ్యాలన్నాడు నారాయణమూర్తిగారు!

నారాయణమూర్తిగారు వెంకటశివం తండ్రి. ఎనభయి ఆరేళ్ళవాడు. ఆయనవుంటున్నది చిన్న పల్లెలాంటి వూరు. సొంత ఇల్లుంది అక్కడ. భార్య ఏనాడో మరణించగా, విధవ అయ్యీ తనింటచేరిన కూతురితో వండించుకు తింటున్నాడాయన.

ఆయనకి చెవులు వినబడవు. కాలు కదపలేదు. కళ్ళు కళ్ళద్దాల సాయంతో ఆ మాత్రంగా పనిచేస్తాయి. "అంతదూరం ఎలా వొస్తాం? అంత మందిమి? పెళ్ళా? మరొహటా? నిన్నెలాగో తీసుకెడ్తాం నాన్నా" అని చెప్పీ చెప్పీ ఓడిపోయాడు వెంకటశివం. "ముసిలాడు మహా గట్టి ముండాకొడుకండీ! ఇంతమందిమి ఇంతదూరం వచ్చేం చచ్చినట్టానూ, అతన్నించీ!" అనీ, పెళ్ళికొడుకు అమ్మమ్మ తిట్టుకుంది.

విడిదిలో వీరవిహారం చేశారు మగపెళ్ళివాళ్ళు.

"కాఫీలు కాఫీలు" అని గావుకేకలేశారు. "వుప్మాలో జీడిపప్పు తగల్లేదు" అని నేరారోపణ కావించేరు!

"పోస్కుందికి నీళ్ళు చాలడం లేద"ని ఫిర్యాదులు చేశారు.

"వీళ్ళు బూరెల్లో పురుగులేరే రకం! రేపేం అరడి పెడ్తారో పిల్లని!?" అంటూ వెంకటశివం వాపోయాడు.

భోజనాల్దగ్గర కూడా గొడవలే! "ఆ అప్పడం పల్చగా వుంది", "ఈ కూరలో కారం లేనే లేదు", "పులుసు టొమాయి నీళ్ళల్లా వుంది", "ఇది పెరుగా? ఛీఛీ!" సగం సగం తినీ, లేచిపోవడాలు, చాలా పదార్థాలు వేస్టు చేశారు!

ఆడపెళ్ళివారి గుండెలు పీచుపీచుమన్నాయి.

ఆరోజు రాత్రి ఒంటిగంటన్నరకి ముహూర్తం!!

అవాళంతా ఏదో ఒక రభస చేస్తూనే వున్నారు మగపెళ్ళివాళ్ళు!

పెళ్ళివారు చాలామంది. ఆ చిన్నవూరిలో వున్న డొక్కు సినిమా హాళ్ళు రెండింటికీ వెళ్ళారు. వెళ్ళకపోతే వాళ్ళ పరువేదో పలచబడిపోయినట్టూ!

వూరంతా ముట్టి వచ్చేరు. ముస్తాబులయ్యి.

"ఎలా వుంటాడే, నీ మొగుడూ?" అనడిగింది దమయంతిని వాళ్ళ పిన్ని.

"పెళ్ళి చూపుల్లో ఫర్వాలేదు!" అని చెప్పింది దమయంతి.

"ఏమిటి? ప్రెస్సుందా అతనికి? అంటే ఏవిటి చేస్తాడే?" –

"అచ్చు వేస్తాడా? వూరందరికీ? అచ్చుపనులన్నీనా?" అడిగింది బాబాయి భార్య.

"అనే అనుకుంటానే!..." అంది దమయంతి.

"మాట్లాడేవా? లేదా అతన్తో?"

"ఏవుంటాయి మాటలు?" నవ్వేసింది దమయంతి.

"అబ్బో! అయితే చేతల్లోనే చూపిస్తావన్నమాట! నీ గొప్పదనం!!"

రాత్రి భోజనాలయిపోయినాయి.

పెళ్ళితంతు ప్రారంభించారు. పెళ్ళి మండపం అద్భుతంగా తయారుచేయబడింది!


పెళ్ళివారే కాకుండా, ఆ వూళ్ళో దగ్గరగా వున్న వాళ్ళుకూడా ఆ వేడుక చూడ్డానికి వచ్చేరు.

రాత్రి పదకొండు గంటలప్పుడు మళ్ళా కరెంటు పోయింది.

పుదయం మూడుసార్లు కరెంటుపోతే, పెళ్ళివారెవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. పగటి వెలుగులో ఆ లోటు తెలియలేదెవరికీ. సాయంత్రం ఏడు గంటలకి లైట్లు ఆరిపోయినాయి! ఒకటిన్నర గంట సేపు కరెంటు రాలేదు!! మగ పెళ్ళివారు చాలా గోల చేశారు!

పెట్రోమాక్స్ లైట్లకోసం తీవ్రంగా ప్రయత్నించారు ఆడపెళ్ళివారు. కాని అవి దొరకలేదు. విచారించేరు.

"ఈ వూర్లో కరెంటు ఎప్పుడు పోతుందో మీరు తెల్సుకోవద్దా?" అని సాధించేరు!



''మాకు ఎంత అసౌకర్యంగా వుంటుందో మీరాలోచించక్కర్లేదా?''

''ఛీఛీ! ఇలా అయితే మేం వెళ్ళిపోతాం!'' అని తెయ్యిమంటూ చిందులు వేశారు కొంతమంది!

ఆడపెళ్ళివారు, వాళ్ళని బ్రతిమాలుకున్నారు.

హరికెన్ లాంతర్లు అయిదారు సంపాదించారు. తీరావాట్లో కిరసనాయిలు చాలలేదు. ఆ వూర్లో ఈ మధ్య కిరసనాయిలు కరువుట!!

''వెధవ కరువు! పాడు కరువు! అన్నిటికీ కరువే!'' అని తిట్టేడు పెళ్ళికొడుకు తండ్రి.

పెళ్ళికూతురు చీకట్లో నిశ్శబ్దంగా దుఃఖించింది.

''ఇక్కడ వద్దంటే విన్నావ్‌కావు! చూడిప్పుడెలా బాధపడ్తున్నావో?'' అన్నాడు వెంకటశివం తండ్రితో కోపంగా.

వెలిగీ వెలగని లాంతర్ల వెలుగులో పెళ్ళితంతు కొనసాగించేరు.

''ఈ కరెంటు కోత ఎప్పటికి పోతుందండీ?'' అనడిగేడొకాయన మరొకర్ని.

''ఏవిటి పోయింది చెప్పండీ మనకీ? దరిద్రం పోయిందా? కష్టాలు పోయేయా? దాచుకుందికీ, దోచుకుందికీ గదా, మనం వాళ్ళని కుర్చీలెక్కిస్తున్నాం? అంచేత ఏ కోతేనా అనుభవించాలి!!'' అన్నాడాయన విసినిక్రరతో విసుగ్గా వీపు గోక్కుంటూ.

ఎప్పటికయినా కరెంటు వస్తుందని ఎదురు చూస్తున్నారుగాని రాలేదది.

అనేకమందితో పెళ్ళి మండపం వుక్కిరిబిక్కిరిగా వుక్కవుక్కగా, తిక్కతిక్కగా వుంది.

పీటలమీద వధూవరుల్ని కూచోబెట్టారు.-

వరుడు కాశీ బయల్దేరడమూ, గెడ్డంకింద బెల్లంముక్క అన్నీ అయినాయి. పురోహితుడు మైకు లేకపోయినా మైరావణుడి కంఠంతో అదరగొట్టేస్తున్నాడు! ఎవళ్ళూ వధూవరుల్ని చూడ్డంలేదు. ఎవరి సొదలు వాళ్ళవి. గుంపులు గుంపులుగా మాట్లాడుకొంటున్నారు.

గాలి రయ్యిమంటూ వీచీ, రెండు హరికెన్ లాంతర్లని ఆర్పేసిపోయింది! కిర్సనాయిలుకూడా కొండెక్కేసింది!! అంధకారం!!

అంతలో పెద్ద గలభా లేచిందక్కడ!

''బాబో! అమ్మో!'' కేకలు! అరుపులు!

పీటలవద్ద వున్న నూనెదీపం గాలికి చీకట్లో సరిగ్గా చూచుకోని పొరబాటుకి పెళ్ళికొడుకు పంచెకి అంటుకుంది. మంట భగ్గుమంది! గబగబా కాలిపోతోంటే ఆ అబ్బాయి కేకలేశాడు! చీకటి! మొదటెవరికీ సరిగ్గా తెలియలేదు. బోధపడలేదేం జరిగిందో ఏంటో చీకట్లో.

తర్వాత అంతా పెద్ద గోల గోల!

పెళ్ళికొడుక్కి శరీరం కాలిపోయింది!!

నలుగురూ వెళ్ళి పంచెలాగీ, మంట ఆర్పేసరికే గబగబా అతని వళ్ళు కాలిపోయింది!!

చెల్లాచెదురయ్యేరంతా.

అలోపాలోమన్నారు. విచారించారు. బాధపడ్డారు. విసుక్కున్నారు. నిష్టూర్యాలు ఆడుకున్నారు. నిందించుకున్నారు.

"పెళ్ళికొడుక్కి... నిక్షేపంగా వున్న కుర్రవాడికి ప్రారబ్ధం ఏవిటండీ?"

"అమ్మాయి జాతకంలో దోషం వుండే వుంటుందండీ! జాతకం అబద్ధం రాయించి వుంటారు! అంచేతే ఇలా అయింది"

"పిల్లవల్లే కుర్రాడికీ ప్రమాదం!!"

"అమ్మో! ఇంకా నయ్యం! ప్రాణాలు పోను!"

"ఛీఛీ! ఏం పెళ్ళి? మాకు వద్దీ సంబంధం! పుస్తె కట్టలేదింకా నయ్యం!"

కుర్రవాడి తండ్రి తెయ్యిమంటూ చిందులు తొక్కాడు.

పిల్లనీ, పిల్ల తల్లిదండ్రుల్నీ తిట్టాడు. వీరవిహారం చేశాడు.

మగపెళ్ళివాళ్ళు అప్పటికప్పుడు లేచి వెళ్ళిపోయారు!!

ఆడపెళ్ళివారు హతాశులైపోయారు.

మండపం దిగాలుగా వుంది.

పెళ్ళికూతురు దమయంతి చీరె చెంగుతో కళ్ళొత్తుకుంటూ, ఎక్కిళ్ళు పడుతూ ఏడుస్తున్నది.

ఆమె తండ్రి, తల్లి పైకి ఏడవలేక, చేతులతో ముఖాలు కప్పుకొని రోదిస్తున్నారు.

ఇంకా తెలవారలేదు.

చీకట్లో రోదనలు, వారి గుండెలలో కోతలు. ఆ రాత్రి జరిగిన విషాదానికి సంకేతాలుగా నిలిచిపోయినాయి!!



## పండు

దీనదయాళ్ చెయ్యి చూస్తున్న జ్యోతిష్కుడు.

"నాకు త్వరలో పెళ్ళి కాబోతోంది. నా భార్య ఎలా వుంటుందంటారు?" అడిగాడు దీనదయాళ్.

"అలాగే చెప్తా... ఏదయినా ఒక పండు పేరు చెప్పు. దానిమీదే నీ కాపురం ఆధారపడి వుంది" అన్నాడు జ్యోతిష్కుడు.

"చింతపండు" చెప్పాడు దీనదయాళ్.

"అబ్బ... చంపావు కదయ్యా... చింతపండుతో చారు కాసినట్లే, మీ ఆవిడ నిన్ను కాచుకుంటుంది" చెప్పాడు జ్యోతిష్కుడు.

—శ్రీకొండ (ఎర్రబోడు)